సాక్షి
అన్నమయ్య జిల్లా

ఆదివారం ၊ 13 ၊ ఆగస్టు ၊ 2023



వైభవంగా ముత్తుమారెమ్మ జాతర

నందలూరు రైల్వేకేంద్రంలోని అరవపల్లెలో ముత్తుమారెమ్మ జాతర శనివారం ప్రారంభమైంది. తొలిరోజు అమ్మవారి కోవెలలో కుంకుమపూజ నిర్వహించారు. - 8లో



డాడీ హోం రాజారెడ్డి అనుమానాస్పద మృతి

ఎందరో అనాథలను చేరదీసి వారికి కొత్త జీవితాన్ని ప్రసాదించిన డాడీ హోం వ్యవస్థాపకుడు రాజారెడ్డి మృతి చెందారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.500	రూ.600
రెండోరకం	రూ.360	రూ.480



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 282 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	447	512
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 406.24 కిలోలు

జీవన ప్రమాణాలు
మెరుగుపరచాలి

జాతీయ సఫాయి కర్మచారీ కమిషన్ చైర్మన్ ఎం వెంకటేషన్



మాట్లాడుతున్న వెంకటేషన్, చిత్రంలో కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి : సఫాయి కర్మచారుల జీవన ప్రమాణాలను మెరుగుపరచాలని, వారి జీవితాలలో వెలుగులు నింపేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకోవాలని, జాతీయ సఫాయి కర్మచారీ కమిషన్ చైర్మన్ ఎం వెంకటేషన్ పేర్కొన్నారు. శనివారం అన్నమయ్య జిల్లా కేంద్రం, రాయచోటి కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, జిల్లా ఎస్పీ గంగాధర్ రావు, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. జిల్లా పంచాయతీ అధికారి ధనలక్ష్మీ సఫాయి కర్మచారీలకు జిల్లాలో చేపడుతున్న వివిధ సంక్షేమ పథకాలు, వారి స్థితిగతులు గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా చైర్మన్‌కు వివరించారు. జిల్లాలో 554 గ్రామాలు ఉన్నాయని, అన్ని గ్రామాలు బహిరంగ మలవిసర్జన రహిత గ్రామాలుగా గుర్తించినట్లు చెప్పారు. 548 గ్రామాలలో ఘన వ్యర్థాల నిర్వహణ జరుగుతోందని చైర్మన్‌కు తెలిపారు. జిల్లాలో 1291 క్లాప్ మిత్రలు ఉన్నారన్నారు. పట్టణ ప్రాంతాలలో 163 మంది శాశ్వత సఫాయి కర్మచారులు పనిచేస్తున్నారని తెలిపారు. జిల్లాలో పారిశుధ్యానికి వాడుతున్న ట్రై సైకిల్స్, ట్రాక్టర్స్, ఇన్‌సెనరేటర్స్, తదితర యంత్రాలు గురించి ఆమె చైర్మన్‌కు వివరించారు. జాతీయ సఫాయి కర్మచారీ కమిషన్ చైర్మన్ ఎం వెంకటేషన్ మాట్లాడుతూ సఫాయి కర్మచారుల అభ్యున్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ చేరేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. దేశాన్ని పరిశుభ్రంగా ఉంచడంతో సఫాయి కార్మికులు చేస్తున్న కృషి ఎనలేనిదన్నారు. కలెక్టర్ గిరీషా పీఎస్ మాట్లాడుతూ అధికారులందరూ సఫాయి కర్మచారుల సమస్యలను నిర్ణీతకాల పరిమితిలో పూర్తి చేయాలన్నారు. ప్రావిడెంట్ ఫండ్, ఈఎస్ఐ తదితర వాటి గురించి అవగాహన కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. జిల్లా ఎస్పీ గంగాధర్ రావు మాట్లాడుతూ సఫాయి కర్మచారీ చట్టం 2013లో చాలా బలమైందన్నారు, వారి పరిరక్షణకు అన్ని చర్యలు చేపడుతున్నామన్నారు. ఫోన్ కాల్ చేసి వారి సమస్యలను తెలియజేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఆర్‌ఓ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ రోడ్లకు మహర్దశ

- రెండో విడత రహదారుల అభివృద్ధికి రూ. 302.17 కోట్లు మంజూరు
- తీరనున్న గ్రామీణుల చిరకాల కోరిక



తారు రోడ్డుగా మారనున్న పీలేరు మండలం బండమీద హరిజనవాడ మట్టిరోడ్డు

పీలేరురూరల్ : గ్రామీణుల చిరకాల కల నెరవేరనుంది... గతంలో పల్లెలకు వెళ్లాలంటే గతుకులు గుంతల మయమైన రోడ్లు దర్శమిచ్చేవి. పల్లెలకు కొత్త రోడ్లు మంజూరు కావడంతో ఇకపై ఆ పరిస్థితి పూర్తిగా మారిపోనుంది. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల మట్టి, కంకర రోడ్ల స్థానంలో తారు రోడ్డు ఏర్పాటు చేయడానికి ఈఏపీ గ్రాంటు పథకంలో మొదటి విడతలో రూ. 250.72 కోట్లు మంజూరయ్యాయి. పనులు కూడా చేపట్టారు. రెండో విడతలో ప్రభుత్వం 236 రోడ్డు పనులకు గానూ 302.17 కోట్లు నిధులు మంజూరు చేసింది. పలు చోట్ల ఇప్పటికే పనులు ప్రారంభమై చురుగ్గా జరుగుతున్నాయి.మరికొన్ని ప్రాంతాల్లో టెండర్ల ప్రక్రియ పూర్తయింది. త్వరలోనే గ్రామీణ రోడ్లకు మహర్దశ రానుంది. గత ప్రభుత్వ హయాంలో గ్రామీణ రోడ్ల గురించి పట్టించుకోలేదని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వీటిపై ప్రత్యేక దృష్టి పెట్టి నిధులు మంజూరు చేయడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

మారనున్న గ్రామీణ రోడ్ల రూపురేఖలు...

జిల్లాలో గ్రామీణ రోడ్ల రూపు రేఖలు త్వరలోనే మారనున్నాయి. రెండో విడతలో 263 మట్టి రోడ్లను తారు రోడ్లుగా అభివృద్ధి చేయడానికి రూ. 302.17 కోట్లు నిధులు మంజూరయ్యాయి. నియోజకవర్గాల వారీగా పీలేరుకు 40 రోడ్లు, రాయచోటికి 22 రోడ్లు మంజూరు కాగా 12 పనులు పూర్తయ్యాయి. రాజంపేటలో 11రోడ్లకు గాను 5 పూర్తయ్యాయి. రైల్వే కోడూరుకు 15 రోడ్లు మంజూరు కాగా 6 పూర్తయ్యాయి. మదనపల్లెకు 75 రోడ్లు మంజూరు కాగా పనులు జరుగుతున్నాయి. తంబళ్లపల్లెకు 100 రోడ్లు మంజూరయ్యాయి. దాదాపు పనులు పూర్తయినట్లు అధికారులు తెలిపారు.

జిల్లాలో రెండో విడతలో మంజూరైన రోడ్డు పనులు, నిధులు

నియోజకవర్గం	పనులు	నిధులు (రూ.కోట్లలో)
పీలేరు	40	51.08
మదనపల్లె	75	84
తంబళ్లపల్లె	100	98.24
రాయచోటి	22	19
రైల్వేకోడూరు	15	25.07
రాజంపేట	11	24.78
మొత్తం	263	302.17

మరిన్ని రోడ్ల అభివృద్ధికి కృషి



రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం విరివిగా నిధులు మంజూరు చేస్తోంది. గత ప్రభుత్వం రోడ్ల అభివృద్ధి విషయం పూర్తిగా విస్మరించింది. జగనన్న అధికారంలోకి వచ్చాక రెండో విడతలో విరివిగా నిధులు కేటాయించి రోడ్లు వేయడం జరుగుతోంది. మూడో విడత కూడా మరిన్ని రోడ్ల అభివృద్ధికి కృషి చేస్తాం.
– పి.వి. మిథున్‌రెడ్డి, రాజంపేట ఎంపీ.

యుద్ధప్రాతిపదికన పనులు



గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా కారణంగా పలు గ్రామీణ రోడ్లు పూర్తి దెబ్బతిన్నాయి. అయితే రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణాభివృద్ధికి పెద్దపీట వేస్తూ రోడ్లకు నిధులు మంజూరు చేసింది. రోడ్ల సమస్యలపై తమకు అందిన విన్నపాలు, ఫిర్యాదు మేరకు కొత్తగా రోడ్లు మంజూరు చేయించాం. యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టడానికి చర్యలు తీసుకుంటాం.
– చింతల రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యే, పీలేరు.

డిసెంబర్‌లోగా పనుల పూర్తికి చర్యలు...



రెండోవిడత పనులకు సంబంధించి టెండర్ల ప్రక్రియ పూర్తయింది. పనులు చురుగ్గా జరుగుతున్నాయి. తంబళ్లపల్లెలో దాదాపు పనులు పూర్తయ్యాయి. మిగిలిన చోట్ల డిసెంబర్ లోపు పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం. పనులు నాణ్యతో చేపట్టేలా చర్యలు తీసుకుంటాం.
– ఎం. రమణయ్య, ఈఈ, ఉమ్మడి చిత్తూరు జిల్లా.

ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం



మా గ్రామానికి సరైన రోడ్డు లేదు.దీనికి సంబంధించి అర్జీలు ఇచ్చినా ప్రయోజనం లేదు. అత్యవసర సమయంలో బయటికి వెళ్లాలంటే ఇబ్బందులు ఎదురయ్యేవి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక రూ. 1.90 కోట్లతో కొత్తగా రోడ్డు మంజూరైంది. గ్రామస్తుల చిరకాల కల నెరవేరింది. ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం.
–నాగరాజు, మాజీ ఎంపీటీసీ, బండమీద హరిజనవాడ.

ఎర్రగుంట్ల–నంద్యాల మార్గంలో ప్రత్యేకరైళ్ల పరుగులు



రాజంపేట : ఎర్రగుంట్ల–నంద్యాల రైలు మార్గంలో ప్యాసింజర్ రైళ్లను ప్రయోగాత్మకంగా నడిపించేందుకు విజయవాడ–గూడూరు మధ్య జరుగుతున్న థర్డ్‌లైను పనులు కలిసివచ్చాయి. దీంతో ప్రత్యేక రైళ్లు ఈ మార్గంలో పరుగులు తీస్తున్నాయి. వీటిని రెగ్యులర్‌గా నడిపించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. విజయవాడ–గుడూరు మధ్య నడుస్తున్న పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దు చేశారు. వీటికి సంబంధించి రేక్ (ఫార్మిసిస్)లు ఖాళీగా తిరుపతి స్టేషన్‌లో ఉంచుకోవాల్సి ఉంది. ఫలితంగా వివిధ రైళ్లకు స్టేబుల్ సమస్య ఉత్పన్నమవుతోంది. ఈనేపథ్యంలో రద్దయిన రైళ్లను కొత్త మార్గంలో హాలిడే ఎక్స్‌ప్రెస్‌లుగా నడిపిస్తున్నారు. దీంతో వైఎస్సార్ ఉమ్మడి జిల్లా వాసులకు అందుబాటులో కొన్ని రైళ్లు తాత్కలికంగానైనా వచ్చాయి. ఇప్పటి వరకు రెగ్యూలర్‌గా గుంటూరు–తిరుపతి ఎక్స్‌ప్రెస్, నంద్యాల–కడప డెమో రైలు నడుస్తున్నాయి.

తిరుపతి–కాకినాడ టౌన్ మధ్య.

ఆగస్టు 13, 14, 15 తేదీల్లో తిరుపతి–కాకినాడ (07063–107064)మధ్య హాలిడే ఎక్స్‌ప్రెస్ రైళ్లను నడిపిస్తున్నారు.వీటికి రైల్వేకోడూరు, రాజంపేట , నందలూరు, కడప, కమలాపురం, ఎర్రగుంట్ల, ప్రొద్దుటూరు, జమ్మలమడుగులో స్టాపింగ్స్ ఇచ్చారు. తిరుపతిలో రాత్రి 9.45కు బయలుదేరి, కాకినాడలో సాయంత్రం 4గంటలకు బయలుదేరుతుంది.

నర్సాపూర్–తిరుపతి ఎక్స్‌ప్రెస్ రైలు..

నర్సాపూర్–తిరుపతి ఎక్స్‌ప్రెస్ (07061–62) రైలును కూడా ఎర్రగుంట్ల–నంద్యాల రైలుమార్గంలో నడిపిస్తున్నారు. ఈ రైలు రద్దయిన కారణంగా హాలిడే ఎక్స్‌ప్రెస్ రైలును నడిపిస్తున్నారు. ఆగస్టు 13, 14వ తేదీల్లో నర్సాపూర్‌లో సాయంత్ర 6గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 10గంటలకు తిరుపతి చేరుకుంటుంది. ఆగస్టు 14, 15 తేదీల్లో తిరుపతిలో రాత్రి 8.15కు బయలుదేరుతుంది. నర్సాపూర్‌కు మరుసటి రోజు మధ్యాహ్నం 12.15 నిమిషాలకు చేరుతుంది. వీటితో పాటు షేల్‌చర్,–తిరువనంతపురం , షేల్‌చర్–కోయంబత్తూరు, బెంగళూరు–గౌహతి, కోయంబత్తూరు–షల్‌చర్ గౌహతి–బెంగళూరు, సుఖియా–బెంగళూరు, బెంగళూరు–సుఖియా, మధురై– నిజాముద్దీన్, ఎర్నాకులం–హౌరా రైళ్లతోపాటు మరికొన్నింటిని కొత్త మార్గంలో తిప్పుతున్నారు.

రెండో విడత భూసర్వే వేగవంతం

జిల్లా సర్వే, భూరికార్డుల అధికారి జయరాజ్



రీసర్వేపై సర్వేయర్లకు సూచనలిస్తున్న జిల్లా సర్వే, భూరికార్డుల అధికారి జయరాజ్

మదనపల్లె : అన్నమయ్య జిల్లాలో రెండోవిడత భూ రీ సర్వే పనులు వేగవంతం చేసినట్లు జిల్లా సర్వే, భూరికార్డుల అధికారి జయరాజ్ తెలిపారు. శనివారం మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌లోని రీ సర్వే డీఎల్‌ఆర్ సెంటర్‌ను సందర్శించారు. డివిజన్‌లో జరుగుతున్న రీ సర్వే పనులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ... జిల్లాలో మొత్తం 470 రెవెన్యూ గ్రామాలకు సంబంధించి వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు – భూ రక్ష కింద మొదటిదశలో జిల్లాలో పైలట్‌ప్రాజెక్ట్ కింద 73 గ్రామాల్లో రీ సర్వే చేపట్టామన్నారు. 81,000 ఎకరాల్లో సమగ్ర రీసర్వేకు సంబంధించి.. సరిహద్దు రాళ్ల నాటడం నుంచి భూహక్కు పత్రాల పంపిణీ వరకు అన్ని దశలు పూర్తిచేశామన్నారు. రెండోవిడత రీ సర్వేకు సంబంధించి 43 గ్రామాల్లో 1,25,000 ఎకరాలు ఆగస్టు 31లోపు పూర్తిచేయాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నామన్నారు. ఇప్పటివరకు 30 గ్రామాలు పూర్తిచేశామని, మిగిలిన 13 గ్రామాలు గడువులోపు పూర్తిచేసేందుకు 100 మంది గ్రామసర్వేయర్లు, 9మంది మండల సర్వేయర్లు, 4 డిప్యూటీ ఇన్స్‌పెక్టర్‌లు పూర్తిస్థాయిలో శ్రమిస్తున్నారన్నారు. మూడోవిడత రీసర్వే సెప్టెంబర్ 1 నుంచి ప్రారంభమవుతుందన్నారు. దాదాపు వందేళ్ల తర్వాత రాష్ట్రంలో రీ సర్వే జరుగుతోందని, ఈ సందర్భంగా అక్కడక్కడా చిన్న చిన్న సమస్యలు ఎదురైనప్పటికీ అప్పీళ్లు తీసుకుని పరిష్కరించామన్నారు. మదనపల్లె మండలం తేనెటీగలవారిపల్లెలో 1.24 సెంట్లకు కేవలం 22 సెంట్లు నమోదుకావడంపై విజయవాడలోని సెంట్రల్ సర్వే కార్యాలయానికి సమాచారం అందించి కొత్త మోడ్యూల్ ప్రకారం సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డివిజనల్ సర్వేయర్ కృష్ణమూర్తి, మండల సర్వేయర్ సుబ్రహ్మణ్యం, జిల్లా రీసర్వే కోఆర్డినేటర్ వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దిగొచ్చిన టమాటా ధర



కడప అగ్రికల్చర్ (వైఎస్సార్‌జిల్లా): మొన్నటి వరకు కిలో రూ. 100 ఉన్న టమాటా ధర దిగొచ్చింది. రైతుబజార్‌లో కిలో రూ. 42కు విక్రయిస్తున్నారు. దీంతో వినియోగదారులకు ఊరటనిచ్చింది. మిగిలిన కూరగాయల ధరలు కూడా తగ్గుముఖం పడుతున్నాయి. వారం క్రితం కిలో రూ. 98 ఉన్న బీన్స్ ప్రస్తుతం రూ. 70 చేరుకుంది. కిలో రూ. 70 ఉన్న మిరప రూ.40కి చేరింది.కానీ అల్లం మాత్రం నెల రోజుల నుంచి కిలో రూ. 250 ఉంది.ఈ ధర నేటికి అలాగే కొనసాగుతోంది.

స్వచ్ఛ సర్వేక్షణ్‌పై సెంట్రల్ టీమ్ సర్వే

రామసముద్రం : స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్‌పై సెంట్రల్ టీమ్ శనివారం రామసముద్రం , చొక్కాండ్లపల్లి పంచాయతీల్లో ఎస్ఎస్‌జి పర్యవేక్షకులు మనోజ్‌కుమార్ సర్వే నిర్వహించారు. మండలంలోని గ్రామాల్లో పారిశుద్ధ్యం, డంపింగ్ యార్డ్, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, వ్యక్తిగత మరుగుదొడ్లు, మసీదులు, సచివాలయ తదితర ప్రాంతాల్లో స్వచ్ఛ సర్వేక్షణ్‌పై పరిశీలించారు. గ్రామాల్లో ప్రజలు పాటిస్తున్న పరిశుభ్రతపై ప్రభుత్వ కార్యాలయాలు తదితర ప్రాంతాల్లో మరుగుదొడ్ల వాడకం , వాటి వినియోగంపై సర్వే నిర్వహించి ఫొటోలను అప్లోడ్ చేశారు. చెత్త సేకరణతో వర్మీ కంపోస్ట్ తయారీ విధానాలపై ఆరా తీశారు. స్వచ్ఛ గ్రామీణ ప్రాంతాలను గుర్తించి దేశంలో ఆదర్శ గ్రామాలుగా ఉత్తమ అవార్డులు అందజేయడం జరుగుతుందన్నారు. గ్రామాల్లో పరిశుభ్రతను బట్టి పూర్తి నివేదిక అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో టీమ్ సభ్యులు విజయ్‌కుమార్, రాజు, పంచాయతీ కార్యదర్శులు విద్యావతి, మునస్వామి నాయక్, రెడ్డిశేఖర్, లావణ్య పాల్గొన్నారు.

21లోపు ఇంటింటి ఓటర్ల సర్వే పూర్తిచేయాలి



మాట్లాడుతున్న ఆర్డీఓ ఎం.ఎస్.మురళి

మదనపల్లె : ఎన్నికల సంఘం నిర్దేశించిన ప్రకారం ఇంటింటి ఓటర్ల సమగ్ర సర్వే ఆగస్టు 21లోపు వందశాతం పూర్తిచేయాలని ఆర్డీఓ ఎం.ఎస్.మురళి తెలిపారు. శనివారం సబ్ కలెక్టరేట్‌లో ఓటర్ల సమగ్ర సర్వేకు సంబంధించి ఏఈఆర్వోలు, సూపర్‌వైజర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. తదుపరి మున్సిపాలిటీ కౌన్సిల్ హాలులో బీఎల్వోలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. బూత్ లెవెల్ అధికారులు ఇంటింటికీ వెళ్లి ఓటర్లను స్వయంగా పరిశీలించి.. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటుహక్కు కల్పించాలన్నారు. ఓటరు జాబితాలో డబుల్ ఎంట్రీలు, నకిలీ ఓట్లు గుర్తింపు చేపట్టాలన్నారు. డోర్ నెంబర్లు లేని, డోర్ నెంబర్‌పై పదుల సంఖ్యలో ఉన్న ఓట్లను సమగ్రంగా పరిశీలించాలన్నారు. పట్టణంలో అద్దె ఇళ్లలో నివాసం ఉంటున్న ఓటర్లు వేరే ప్రాంతాలకు వెళ్లి ఉంటే.. వారి కోరిక మేరకు ఓట్లను ఏ ప్రాంతంలో ఉంచాలో కనుక్కొని అందుకు అనుగుణంగా మార్పులు చేయాలన్నారు. పేర్లు, నియోజకవర్గాలు, చిరునామాలు, ఫోన్ నెంబర్లు, ఫోటో గుర్తింపు కార్డులు మార్పులు, చేర్పులు, తప్పుఒప్పులు సరిచేయడం సర్వేలో చేయాలన్నారు. ఓటర్ల అభ్యర్థన మేరకు ఒక చోటు నుంచి మరోచోటుకు మార్చడం వంటివి చేయాలన్నారు. మదనపల్లె నియోజకవర్గంలో ఇప్పటివరకు ఇంటింటి సర్వే 50 శాతం మాత్రమే పూర్తి అయిందని, ఆన్‌లైన్‌లో 30 శాతం మాత్రమే నమోదు జరిగిందన్నారు. బీఎల్వోలు ఏ రోజు సర్వేకు సంబంధించి ఆరోజు ఆన్‌లైన్‌లో వివరాలను నమోదు చేయాలన్నారు. సమావేశంలో తహసీల్దార్‌లు మహబూబ్‌చాంద్, సీ.ఆర్.మంజుల, కమిషనర్ కే.ప్రమీల, రెవెన్యూ అధికారులు, ఎలక్షన్ డీటీలు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

లారీ ఢీకొని హమాలీ మృతి

మదనపల్లె సిటీ : మదనపల్లె టమాట మార్కెట్‌లో హమాలీని లారీ ఢీకొనడంతో మృతి చెందిన సంఘటన శనివారం జరిగింది. స్థానిక అనపగుట్టకు చెందిన సుధాకర్(46) టమాట మార్కెట్‌యార్డులో హమాలీగా పని చేస్తున్నాడు. మార్కెట్‌లో టమాటలు ఏరుతుండగా ప్రమాదవశాత్తు లారీ సుధాకర్‌ను ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన సుధాకర్‌ను 108 ద్వారా మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతికి రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి అక్క శారదమ్మ ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ షాక్‌తో..

చింతకొమ్మదిన్నె : మండలంలోని కొప్పర్తి పంచాయతీ పరిధిలో గల ప్రకాశంపల్లె దళితవాడకు చెందిన ఈశ్వరయ్య (35) విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. ఆయన తన ఇంటి నిర్మాణ పనుల్లో ఉండగా శుక్రవారం రాత్రి విద్యుత్ షాక్‌కు గురై తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. ఆయనకు భార్యతోపాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ భూమా అరుణ్‌రెడ్డి తెలిపారు.

రైలు కింద పడి..

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్ పరిధిలో ప్రొద్దుటూరు– ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్‌ల మధ్య మాలెపాడు గ్రామ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి ధర్మవరం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయాన్ని ఎర్రగుంట్ల రైల్వే ఎస్‌ఐ కే రారాజు శనివారం తెలిపారు. మృతుడు తెల్లని కాటన్ హాఫ్ చొక్కా ధరించాడు. దానిపై బీఎస్‌ఆర్ టైలర్స్ అని రాసి ఉంది. ఆకుపచ్చ అంచు తెల్లటి పంచె ధరించాడు. ఎవరైనా ఆచూకీ గుర్తిస్తే ఎర్రగుంట్ల పోలీసులకు తెలియజేయాలని రైల్వే ఎస్‌ఐ రారాజు కోరారు.

గుర్తుతెలియని వ్యక్తి..

కడప అర్బన్ : కడప నగర శివార్లలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)కి శనివారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తి దాదాపు (70 సంవత్సరాలు)ని క్యాజువాలిటీకి తీసుకుని వచ్చారు. అప్పటికే మరణించాడని వైద్యులు నిర్ధారించారు. ఆర్‌ఎంఓ డాక్టర్ వై.శ్రీనివాసులు ఆదేశాల మేరకు సిబ్బంది క్యాజువాలిటీ నుంచి మార్చురీకి తరలించారు. ఎవరైనా ఆచూకీ తెలిస్తే నేరుగా తమను సంప్రదించాలని డాక్టర్ శ్రీనివాసులు తెలియజేశారు.

వైభవంగా ముత్తుమారెమ్మ జాతర



అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఆగమ పండితుడు



నాగిరెడ్డిపల్లె అర్బన్ ప్రాంతంలో ముత్తుమారెమ్మ ఊరేగింపు



ఆలయంలో కుంకుమపూజ నిర్వహిస్తున్న మహిళలు

- ఘనంగా అమ్మవారి ఊరేగింపు
- అరవపల్లెలో ఆధ్యాత్మిక సందడి

నందలూరు(రాజంపేట) : తమిళులతోపాటు స్థానికులు ఆరాధ్యదైవంగా పూజించే ముత్తుమారెమ్మ జాతర శనివారం వైభవంగా ప్రారంభమైంది. నందలూరు రైల్వేకేంద్రంలోని అరవపల్లెలో జాతర మహోత్సవంలో భాగంగా తొలిరోజు అమ్మవారి కోవెలలో కుంకుమపూజ వేడుకగా నిర్వహించారు. ఇందులో భాగంగా తమిళనాడు, చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య, వైఎస్సార్ జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. రాష్ట్ర బ్రహ్మణ సేవా సంఘం సమాఖ్య మాజీ ఉపాధ్యక్షుడు స్మార్త ఆగమ పండితుడు బండాత్మకూరు శివకుమార్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.

భక్తులతో కిటకిటలాడిన ఆలయం

అమ్మవారి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. అరవపల్లెలో ఆధ్యాత్మిక సందడి వాతావరణం నెలకొంది. అనుబంధం వున్న తమిళ కుటుంబాలతోపాటు పలువురు కార్మికుల కుటుంబాలు తరలివచ్చారు. స్థానికంగా కూడా అమ్మవారికి మొక్కులు తీర్చుకునేందుకు తరలివస్తున్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

జాతర మహోత్సవంలో భాగంగా శనివారం రాత్రి ముత్తుమారెమ్మ ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి భక్తులు దారిపొడవునా కాయకర్పూరం సమర్పించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. చెక్కభజనలు చేశారు. భక్తుల సందడితో గ్రామం రద్దీగా మారింది.

నేడు ప్రధాన ఘట్టం : ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన జాతరను ఆదివారం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని పెద్ద ఎత్తున భక్తులు సందర్శించనున్నారు. అలాగే మహిళలు పొంగుబాళ్లు పెట్టుకుంటారు. ఇందుకు తగ్గట్టుగా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

దేవాలయాలు, అర్చక వ్యవస్థకు ప్రభుత్వం తోడ్పాటు



డిప్యూటీ సీఎం అంజద్‌బాషాను వేదాశీస్సులతో సత్కరిస్తున్న అర్చకులు

కడప కల్చరల్ : రాష్ట్ర ప్రభుత్వం దేవాలయాలు, అర్చకుల వ్యవస్థకు ఎంతో తోడ్పాటు అందిస్తోందని, మునుపెన్నడూ లేనన్ని సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్ బాషా అన్నారు. తన జన్మదినాన్ని పురస్కరించుకుని స్థానిక మోచంపేటలోని శ్రీ ప్రసన్న విశ్వేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో గల శంకరమఠంలో ఆయన శనివారం కడప నగరానికి చెందిన వివిధ దేవాలయాల్లో పని చేస్తున్న 150 మంది అర్చకులకు నిత్యావసర సరుకుల కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో శాంతి నెలకొనేందుకు కృషి చేస్తున్న అర్చకులు, దేవాలయాల వ్యవస్థను మరింత పటిష్టం చేసేందుకు ఆర్థిక ఇబ్బందులు లేకుండా చూసేందుకు కరోనా సమయంలో కూడా రాష్ట్ర ప్రభుత్వం ఆదుకున్నదని తెలిపారు. అర్చకులకు జీతభత్యా లు, ఆలయాల రక్షణకు పలు పథకాలు అమ లు చేస్తున్నారని తెలిపారు. అర్చక సమాఖ్య అధ్యక్షులు, కార్యక్రమ నిర్వాహకులు విజయ్ భట్టర్ మాట్లాడుతూ నగర శివార్లలోని మామిళ్లపల్లె లే అవుట్‌లో ఇంతకుముందు ప్రకటించినట్లుగా అర్చక సమాఖ్య కోసం స్థలాన్ని కేటాయించాలని, మోచంపేటలోని శంకర మఠాన్ని సమాఖ్య నిర్వహణ కోసం అందజేయాలని కోరారు. ఇందుకు డిప్యూటీ సీఎం సానుకూలంగా స్పందిస్తూ ఈ విషయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా అర్చకులు సామూహికంగా డిప్యూటీ సీఎంకు వేదాశీస్సులు అందజేసి ఘనంగా సత్కరించారు.

రాజీవ్ కల్చరల్ క్లబ్‌లో..

స్థానిక కళాక్షేత్రం వద్దగల రాజీవ్ కల్చరల్ క్లబ్‌లో వైఎస్సార్‌సీపీ సాంస్కృతిక విభాగం నగర అధ్యక్షులు వైఎస్ సాయిబాబా అధ్యక్షతన ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా జన్మదినాన్ని పురస్కరించుకుని క్లబ్ చైర్మన్ మురళితో కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సాయిబాబా మాట్లాడుతూ కళాకారుల క్షేమం పట్ల ఎంతో చిత్తశుద్ధితో పార్టీ పక్షాన కళాకారులైన వారితో సాంస్కృతిక విభాగాన్ని ఏర్పాటు చేయడం సంతోషదాయకమన్నారు. సభ్యులంతా ఎప్పటికప్పుడు సమస్యలను కళారూపాల ద్వారా సమాజం దృష్టికి తెచ్చేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం సాంస్కృతిక కమిటీ ఉపాధ్యక్షులు ప్రకాశం, శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి మురళి, గంగయ్య, రాజేష్‌బాబు తదితరులు డిప్యూటీ సీఎంను ఘనంగా సత్కరించి ఆయన పేరిట కేక్ కట్ చేశారు.

నెల్లూరు జిల్లాలో రోడ్డు ప్రమాదం

పెద్దమండ్యంకు చెందిన వ్యక్తి మృతి



నుజ్జునుజ్జయిన బొలెరో పికప్ వాహనం



హరీష్ మృతదేహం

పెద్దమండ్యం : శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో పెద్దమండ్యంకు చెందిన ఓ వ్యక్తి మృతిచెందాడు. కుటుంబ సభ్యుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పెద్దమండ్యంకు చెందిన హరీష్ (32)కు బొలెరో పికప్ వాహనం ఉంది. తనే డ్రైవర్‌గా వెళ్లి సుదూర ప్రాంతాలకు టమాటలు, వంకాయలు, పచ్చిమిరపకాయలు తోలుకుని జీవనం సాగించే వాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి నెల్లూరు జిల్లాలోని దుత్తలూరు మండలం తెడ్డుపాడు సమీపంలో ఆగి ఉన్న టిప్పర్‌ను ఢీకొని బొలేరో పికప్ వాహనం నడుపుతున్న హరీష్ అక్కడికక్కడే మృతి చెందాడు. నెల్లూరు నుంచి పామూరు మీదుగా రాజమండ్రికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. తీవ్రంగా గాయపడిన క్లీనర్‌ను ఉదయగిరి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్సల కోసం నెల్లూరుకు తరలించారు. సంఘటనపై అక్కడి పోలీసులు మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోస్టుమార్టం నిర్వహించిన పోలీసులు మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతదేహాన్ని శనివారం సాయంత్రం పెద్దమండ్యంకు కుటుంబ సభ్యులు తీసుకొచ్చారు. హరీష్ గతంలో 108లో డ్రైవర్‌గా విధులు నిర్వహించారు. మృతునికి భార్య, ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. ఇతని మృతితో కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదించారు.

విస్తృతంగా ఎస్‌ఈబీ దాడులు



నారమాకులతండాలో పట్టుకున్న నాటుసారా, బెల్లం ఊట

మదనపల్లె : అన్నమయ్య జిల్లా అడిషనల్ ఎస్పీ రాజ్‌కమల్ ఆదేశాల మేరకు మదనపల్లె ఎస్‌ఈబీ స్టేషన్ పరిధిలో మండలంలోని నారమాకులతండాలో శనివారం స్పెషల్‌డ్రైవ్ నిర్వహించినట్లు సీఐ శ్రీహరిరెడ్డి తెలిపారు. ఎస్‌ఈబీ సిబ్బంది నారమాకులతండాలో విస్తృతంగా జరిపిన దాడుల్లో గ్రామానికి తూర్పు వైపు 2కి.మీ.దూరంలో నాటుసారా తయారీకి సిద్ధంగా ఉంచిన 500 లీటర్ల బెల్లం ఊటతోపాటు 70 లీటర్ల సారాను గుర్తించామన్నారు. తర్వాత పశ్చిమంవైపు అటవీప్రాంతంలో నిర్వహించిన తనిఖీల్లో 2,300 లీటర్ల బెల్లం ఊటతోపాటు రవాణాకు సిద్ధం చేసిన 105 లీటర్ల నాటుసారాను గుర్తించామన్నారు. అలాగే నాటుసారా తయారీకి తీసుకువచ్చిన 300 కిలోల నల్లబెల్లంను స్వాధీనం చేసుకున్నామన్నారు. పై రెండు ప్రాంతాల్లో గుర్తించిన 2,800 లీటర్ల బెల్లం ఊటను, బట్టీలను ధ్వంసం చేశామన్నారు. 175 లీటర్ల నాటుసారా, 300 కిలోల బెల్లంను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించినట్లు చెప్పారు. ఈ కేసుల్లో నిందితులకు సంబంధించి విచారణ జరుపుతున్నామని, త్వరలో అరెస్ట్ చేస్తామన్నారు.

ఏటీఎం వద్ద మోసంపై వరుస ఫిర్యాదులు

కలికిరి : పట్టణ పరిధిలోని ఎస్‌బీఐ ఏటీఎం కేంద్రం వద్ద జరిగిన మోసాలపై బాధితులు వరుసగా ఫిర్యాదులు చేస్తున్నారు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఏటీఎం కేంద్రం వద్ద ఏమార్చి కార్డు మార్చి ఇచ్చి నగదు లూటీ చేస్తున్న ఘటనపై పూజారి చంద్ర ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదైంది. దీనిపై పత్రికలలో వచ్చిన కథనాలను చూసిన మరో ముగ్గురు బాధితులు తమకు జరిగిన మోసంపై ఫిర్యాదులు చేశారు. మండలంలోని మేడికుర్తి క్రాస్ వద్ద నివాసం ఉంటున్న సయ్యద్ సాహెబ్ గత నెల 29న ఏటీఎం కేంద్రానికి వెళ్లాడు. అక్కడున్న గుర్తుతెలియని వ్యక్తి ఆయన్ను మాటల్లో పెట్టి ఏటీఎం మార్చి ఇచ్చేశాడు. అదే రోజు ఏటీఎం నుంచి రూ.70 వేలు డ్రా చేసేశాడు. బాధితుడు స్టేట్ బ్యాంక్ వద్దకు వెళ్లి కార్డు బ్లాక్ చేయించాడు. నిందితుని ఆచూకీ కోసం గాలించినా లాభం లేకపోయింది. అలాగే కలికిరికి చెందిన మనెమ్మ, రామక్రిష్ణారెడ్డి, వాయల్పాడు మండలానికి చెందిన దిలీప్ కుమార్‌లు కూడా ఇలాగే తమకు మోసం జరిగిందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఏఎస్‌ఐ మధుసూదనాచారి తెలిపారు.

చౌక బియ్యం పట్టివేత

రామాపురం : మండల కేంద్రంలోని బస్‌స్టాప్ వద్ద విజిలెన్స్ సీఐ రెడ్డప్ప, రాయచోటి పౌరసరఫరాల సంస్థ డీటీ కృపావతి ఆధ్వర్యంలో శనివారం ముందస్తు సమాచారంతో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా 270 చౌక (రేషన్) బియ్యం బస్తాలు తరలిస్తున్న లారీని పట్టుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. చెన్నూరు మండలం చొక్కెరచెట్టు వీధికి చెందిన షేక్ ఖాజా చెన్నూరు నుంచి కర్ణాటక రాష్ట్రం బంగారుపేటకు తరలిస్తుండగా మార్గంమధ్యంలో లారీని పట్టుకున్నారు. అందులో 270 బస్తాలు అనగా సుమారు 12,956 కేజీలు బియ్యం ఉన్నాయి. లారీని, డ్రైవర్‌ను మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మహిళను దూషించిన న్యాయవాదిపై కేసు

ప్రొద్దుటూరు క్రైం : మహిళను దూషించిన న్యాయవాది చంద్రశేఖర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణంలోని సుబ్బిరెడ్డి కొట్టాలకు చెందిన బండి లక్ష్మీదేవి తన కుమార్తె విడాకుల విషయమై 2021లో న్యాయవాది చంద్రశేఖర్‌ను సంప్రదించి రూ.32 వేలు ఇచ్చింది. కొన్ని రోజుల తర్వాత పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ జరగడంతో లక్ష్మీదేవి కుమార్తె, అల్లుడు ఒకటయ్యారు. ఇదే విషయాన్ని ఆమె న్యాయవాదికి వివరించింది. విడాకులు అవసరం లేదని తెలిపింది. తాను ఇచ్చిన డబ్బు తిరిగి ఇవ్వాలని ఆమె అడిగింది. దీంతో అతను డబ్బులు అడుగుతావా అని లక్ష్మీదేవిని దూషించడమే గాక చెంపపై కొట్టాడు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు త్రీ టౌన్ పోలీసులు తెలిపారు.

ఏపీజీఈఎఫ్ రాష్ట్ర కో చైర్మన్‌గా లెక్కల జమాల్‌రెడ్డి



కడప ఎడ్యుకేషన్ : ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యవర్గ ఎన్నికల్లో రాష్ట్ర కో చైర్మన్‌గా ప్రగతిశీల రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లెక్కల జమాల్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం గుంటూరులోని రెవెన్యూ కల్యాణ మండపంలో జరిగిన ఈ కార్యవర్గ ఎన్నికల్లో వైఎస్సార్ జిల్లాకు చెందిన జమాల్‌రెడ్డిని రెండవసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇందుకుగాను మాజీ ఎమ్మెల్సీ పోచంరెడ్డి సుబ్బారెడ్డి, పీఎస్‌టీయూ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు పీసీ రెడ్డెన్న, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏసీవీ గురవారెడ్డి, రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు విజయ్‌భాస్కర్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి మునిరెడ్డి, రాష్ట్ర మైనార్టీ కన్వీనర్ మజహరుల్‌హక్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామాంజనేయరెడ్డి, సీపీఎస్ కన్వీనర్ గుజులపల్లె నారాయణరెడ్డి, వైఎస్‌ఆర్ జిల్లా అధ్యక్షుడు పీవీ సుబ్బారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎన్‌వీ సుబ్బారెడ్డి, జిల్లా ఆర్థిక కార్యదర్శి బోగా వెంకట సుబ్బయ్య తదితరులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా లెక్కల జమాల్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి మరింతగా కృషి చేస్తామన్నారు.

జంగంపల్లెలో ఉద్రిక్తత

కమలాపురం : మండలంలోని జంగంపల్లెలో శనివారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గ్రామంలోని రామాలయం ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని స్వామి వారి ఊరేగింపు నిర్వహణలో ఇరు వర్గాల మధ్య విభేదాలు వచ్చాయి. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకున్నారు. గ్రామంలో ఊరేగింపు నిర్వహణను రద్దు చేశారు. దీంతో పరిస్థితులు అదుపులోకి వచ్చాయి.

డాడీ హోం రాజారెడ్డి అనుమానాస్పద మృతి

- పూజా స్కూల్ ప్రాంగణంలో పడి ఉండగా ఆస్పత్రికి తరలింపు
- అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించిన వైద్యులు
- అనుమానంతో రీ పోస్టుమార్టం
- శరీరంపై గాయాలు



రాజారెడ్డి మృతదేహం



రాజారెడ్డి (ఫైల్)

ప్రొద్దుటూరు క్రైం : ఎందరో అనాథలు, అభాగ్యులను చేరదీసి వారికి కొత్త జీవితాన్ని ప్రసాదించిన డాడీ హోం వ్యవస్థాపకుడు రాజారెడ్డి (52) అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. పూజాస్కూల్ ప్రాంగణంలో పడి ఉండగా ఆయనను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు, సన్నిహితులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రాజుపాళెం మండలంలోని పర్లపాడు గ్రామానికి చెందిన నల్లదిమ్మ రాజారెడ్డి సుమారు 20 ఏళ్ల నుంచి మైలవరంలో డాడీ హోం నిర్వహిస్తున్నారు. ఆయన పెళ్లి చేసుకోలేదు. పెద్దముడియం మండలంలోని పాలూరు గ్రామంలో చర్చి ఫాదర్‌గా కొనసాగుతున్నారు. అనాథ, ఎయిడ్స్ బారిన పిల్లలతోపాటు వృద్ధులకు డాడీ హోంలో ఆశ్రయం కల్పించి వారి పోషణా బాధ్యతలను చూస్తున్నారు. అలాగే ప్రొద్దుటూరు మండలంలోని చౌడూరు గ్రామం సమీపంలో సుమారు 40 ఎకరాల విస్తీర్ణంలో పూజా ఇంటర్నేషనల్ స్కూల్, ప్రొద్దుటూరులోని జిల్లా ఆస్పత్రి వెనుక భాగంలో పూజా కిడ్స్ స్కూళ్లను కొన్నేళ్లుగా నిర్వహిస్తున్నారు. రాజారెడ్డి సోదరుడు శ్రీధర్‌రెడ్డితోపాటు అతని భార్య ప్రసన్నలక్ష్మిలు పూజా స్కూల్‌లోనే ఉంటూ నిర్వహణా బాధ్యతలు చూస్తున్నారు. శనివారం, ఆదివారం పాఠశాలకు సెలవులు రావడంతో పూజా స్కూల్‌లోని విద్యార్థులను ఇళ్లకు పంపించారు. దీంతో పూజా స్కూల్లో దూరప్రాంతాలకు చెందిన కొందరు విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులు, పని మనిషులు మాత్రమే ఉన్నారు.

రాత్రి శబ్దం రావడంతో..

శుక్రవారం రాత్రి సుమారు 10.30 గంటల సమయంలో స్కూల్ ప్రాంగణంలో పెద్ద ఎత్తున శబ్దం రావడంతో పై అంతస్తులో ఉన్న ప్రిన్సిపాల్ జాన్ హుటాహుటిన కిందికి వచ్చాడు. శ్రీధర్‌రెడ్డి గాబరా పడుతూ కనిపించడంతో.. తిరిగి ఆయన పైకెళ్లి తొందరగా కిందికి రావాలని తోటి ఉపాధ్యాయులను పిలిచాడు. దీంతో ఉపాధ్యాయులతోపాటు పీఈటీ రామాంజనీ కిందికి వచ్చారు. వారు వచ్చేసరికి కింద పడిపోయిన రాజారెడ్డికి శ్రీధర్‌రెడ్డి, అతని భార్య లక్ష్మీప్రసన్న, కుమార్తెలు సపర్యలు చేస్తున్నారు. కొద్ది సేపటి తర్వాత రాజారెడ్డిని జిల్లా ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరిశీలించి మృతి చెందినట్లు చెప్పారు. విషయం తెలియడంతో సీఐ ఇబ్రహీంతోపాటు రూరల్ ఎస్‌ఐలు చిరంజీవి, శివప్రసాద్ సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. రాజారెడ్డి మృతదేహంపై ఎక్కువ గాయాలు ఉండటం అనేక అనుమానాలను రేకెత్తిస్తోంది. వీపు, ముఖం, చేతులకు గాయాలున్నాయి. దీంతో ఆయన మృతిపై బంధువులు, పూజా స్కూల్ సిబ్బంది అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

అనుమానాలను పెంచిన రీ పోస్టుమార్టం

పూజా స్కూల్ పీఈటీ రామాంజనీ ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేశారు. ఇందులో భాగంగా శనివారం ఉదయం రాజారెడ్డి మృతదేహానికి జిల్లా ఆస్పత్రిలోని డాక్టర్ల బృందంతో పోస్టుమార్టం నిర్వహించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని పూజా స్కూల్‌కు తరలించారు. విద్యార్థులు, బంధువుల సందర్శనార్థం కొంత సేపు అక్కడ ఉంచి తర్వాత మైలవరంలోని డాడీ హోంకు మృతదేహాన్ని తరలించాలని భావించారు. అక్కడే ఉన్న పోలీసు అధికారులకు అనుమానం రావడంతో మరింత లోతుగా రీ పోస్టుమార్టం నిర్వహించాలని డీఎంహెచ్‌ఓను కోరారు. రీ పోస్టుమార్టం నిర్వహించేందుకు కడప నుంచి ప్రొఫెసర్ల బృందాన్ని పంపించనున్నట్లు డీఎంహెచ్‌ఓ తెలిపారు. దీంతో పూజా స్కూల్‌లో ఉన్న రాజారెడ్డి మృతదేహాన్ని తిరిగి జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లగా ప్రొఫెసర్లచే రీ పోస్టుమార్టం చేయించారు. పోస్టుంమార్టం తర్వాత రాజారెడ్డి మృతిపై పోలీసులకు అనుమానాలు మరింతగా పెరిగినట్లు తెలుస్తోంది. ఈ కోణంలో కూడా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. సాయంత్రం మైలవరంలోని డాడీ హోంలో రాజారెడ్డి అంత్యక్రియలు నిర్వహించారు. రాజారెడ్డి మృతితో డాడీహోంలోని అనాథ పిల్లలు బోరున విలపించసాగారు. రాజారెడ్డి తల్లి సుబ్బమ్మ కుమారుని మృతదేహం వద్ద గుండెలవిసేలా రోదించింది.

పోలీసు అధికారుల దర్యాప్తు

ప్రొద్దుటూరు ఏఎస్పీ ప్రేరణాకుమార్, జమ్మలమడుగు డీఎస్పీ నాగరాజు జిల్లా ఆస్పత్రికి చేరుకొని స్కూల్ నిర్వాహకులతో మాట్లాడారు. పోస్టుమార్టం నిర్వహించిన వైద్యులతో కూడా పోలీసు అధికారులు చర్చించారు. కాగా ఇటీవల పూజాస్కూల్ నిర్వహణకు సంబంధించి పూర్తి స్థాయి బాధ్యతలను చిన్నప్పటి నుంచి అక్కడే పెరిగిన ఇరువురు అనాథ బాలికలకు అప్పగించినట్లు తెలిసింది. ఈ కోణంలో కూడా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ప్రముఖుల నివాళులు

రాజారెడ్డి మృతదేహాన్ని పలువురు ప్రముఖులు సందర్శించి నివాళులు అర్పించారు. ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి పూజాస్కూల్‌లో ఉన్న రాజారెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. సేవకు మారుపేరుగా నిలిచిన రాజారెడ్డి మరణం తనను ఎంతగానో కలచి వేసిందని ఆయన తెలిపారు. మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి, ఏఎస్పీ లోసారి సుధాకర్‌తోపాటు రాజుపాళెం మండలంలోని రాజారెడ్డి బంధువులు, సన్నిహితులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. పూజా స్కూల్లో విద్యను అభ్యసించిన పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులు రాజారెడ్డిని కడసారి చూడటానికి వచ్చారు.



పూజా స్కూల్ నిర్వాహకులతో మాట్లాడుతున్న డీఎస్పీ నాగరాజు



విలపిస్తున్న డాడీహోం అనాథ బాలికలు, బంధువులు